క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



తాడేపల్లి రూరల్ : ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని తెలిపారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు గుంటూరు ఈస్ట్, విజయవాడ పశ్చిమం, నెల్లూరు సిటీ, కర్నూలు, కదిరి, కడప, మదనపల్లి కలిపి మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు కేటాయించారని తెలిపారు. ఇది సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.

దేవాంగులకు సముచిత స్థానం కల్పించాలి



మంగళగిరి: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు దేవాంగులకు జనాభా దామాషా ప్రకారం మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ సీట్లు కేటాయించాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. దేవాంగులకు సముచిత స్థానం కల్పించిన రాజకీయ పార్టీలకే తాము మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. చీరాల, పుట్టపర్తి, రాజమండ్రి రూరల్ సీట్లతో పాటు హిందూపురం పార్లమెంట్ సీటును కేటాయించాలని కోరుతూ ఆదివారం పట్టణంలో ఎన్ఆర్ఐ జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి పక్కనున్న కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు డి.కె. నాగరాజు, బల్ల వెంకట రమణ, పుచ్చల రామకృష్ణ, సజ్జ హేమలత, బీరక ప్రసాద్, ఆకాశపు స్వామి, నక్కిన రాజశేఖర్, ఏరాసు ఆరుణబాబు పాల్గొన్నారు.

ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

తాడేపల్లి రూరల్ : పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షుడు మేకా దామేష్‌రెడ్డి, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బొక్కా ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది తలసేమియా వ్యాధితో బాధపడుతూ మృత్యువాత పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఆర్థికసాయం చేశారు. రక్తదానం చేసిన వారికి ఐశ్వర్య ఫౌండేషన్ తరఫున ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీను నాయక్, వందేమాతరం హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ సుభాని, అంజిరెడ్డి, కరీం పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై వెలిసిన కార్మెల్ మాతను ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఉదయాన్నే వాహనాలు, రైలులో వచ్చిన పలువురు కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాత ముందు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

జీజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్యసేవలు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కోట్లాది రూపాయల ఖర్చుతో కార్పొరేట్ వైద్యసేవల్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌లో డాక్టర్ కిరణ్‌కుమార్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్ క్యాన్సర్ విభాగంలో రోగులకు అవసరమైన అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ సిమ్యూలేటర్, మామోగ్రామ్, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వైద్య పరికరాలతో పాటు ఎంతో అనుభవం ఉన్న క్యాన్సర్ వైద్యులు ఉన్నారని చెప్పారు. గతంలో చెన్నై, బెంగళూర్, హైదరాబాద్‌లకు రోగులు వెళ్లే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోనే అన్ని వైద్యసేవలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ కోనేటి నందన తేజ , నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న ధ్యేయం

- తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత
- సందడిగా వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ
- జగనన్నకు కృతజ్ఞతలు తెలిపిన డ్వాక్రా మహిళలు



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే మనసా వాచా కర్మేణా కోరకునే వ్యక్తుల్లో ముందు వరుసలో ఉండే వ్యక్తి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండలంలో వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళలకు అందిన రుణమాఫీ నిధులు విడుదల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గతంలో దిగంవత మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రతి మహిళా లక్షాధికారి కావాలనే ఉద్దేశంతో పావలా వడ్డీ రుణాలు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు 2014 ఎన్నికల ముందు డ్వాక్రా మహిళల రుణాన్ని పూర్తిగా మాఫీ చేస్తానని ప్రగల్భాలు పలకడంతో చాలా గ్రూపులు సకాలంలో రుణాలు చెల్లించకుండా ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. పాదయాత్రలో మహిళల కష్టాలు విన్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు మూడు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణాలు మాఫీ చేశారని తెలిపారు. ఇప్పుడు నాలుగో విడత రుణాలు మాఫీ చేసి నిజాయతీని నిరూపించుకున్నారన్నారు. తాడికొండ మండలంలో 1262 గ్రూపులకు గాను 12,289 మందికి గాను మూడు విడతల్లో రూ.32.36 లక్షలు రుణ మాఫీ జరగగా నాలుగో విడతలో రూ.10.79 కోట్లు అందనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం చూడకుండా అర్హత ఉన్న లబ్ధిదారులకు అందరికీ న్యాయం చేస్తామని చెప్పి దానిని చేతల్లో చేసి చూపించరని తెలిపారు. ఆసరా పథకాలే కాకుండా 45 ఏళ్ల దాటిన మహిళలకు, చేయూత, అమ్మ ఒడి వంటి పథకాలకు ఒక్క తాడికొండ మండలానికే రూ.301 కోట్లు అందించారన్నారు. ఇళ్ల పట్టాలు ఇతర పథకాలకు రూ.100 కోట్లు మొత్తం రూ.396 కోట్లు లబ్ధి చేకూరిందంటే ఎంత గొప్ప విషయం అని చెప్పగానే సభలో చప్పట్లు మార్మోగాయి. తాను ఫిరంగిపురం అమ్మాయిని అని, అందరూ ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు కానీ నేను ప్రత్తిపాడులో రచ్చ గెలిచి ఇంటికి వచ్చానని, ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.10.79 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, సర్పంచ్ తోకల సరోజిని, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, నిడుముక్కల, కంతేరు సర్పంచులు మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్ బాబు, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, యార్డు మాజీ చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, మాజీ చైర్మన్ భీమవరపు బ్రహ్మరెడ్డి, విశ్రాంత బ్యాంకు మేనేజర్ తుమ్మల తిరుపతిరెడ్డి, ఉయ్యూరు వెంకటరెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ అరవింద బాబు, మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ దొడ్డా సుధాకర్, ఎంపీడీవో అనురాధ, వెలుగు ఏపీఎం సాంబశివరావు, సీసీలు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



వేడుకకు భారీగా హాజరైన మహిళలు

జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలవాలని మహిళలంతా కోరుకుంటున్నాం. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తానని ఓట్లు వేయించుకొని బాబు మోసం చేశాడు. నాలుగు విడతల్లో రూ.10,318 చొప్పున నా ఒక్కదానికే రూ.41,272 రుణం మాఫీ జరిగింది. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తేనే మహిళలలంతా ఆర్థికంగా నిలదొక్కుకుంటాం

– మల్లంపాటి మల్లేశ్వరి, అనామికా డ్వాక్రా గ్రూపు

జగనన్నకు రుణపడి ఉంటాం



రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రుణాలు మాఫీ చేసి జగనన్న చేతల్లో చేసి చూపించారు. మా డ్వాక్రా సంఘంలో ఒక్కొక్కరికీ రూ.38,526 చొప్పున 10 మందికి రూ.3,85,280 రుణమాఫీ జరిగింది. ఏపీలోని డ్వాక్రా మహిళలు అందరూ జగనన్నకు రుణపడి ఉంటారు.

– తియ్యగూర నాగమణి, శ్రీ గణేషాగ్రూపు

పథకాలన్నీ సక్రమంగా అందాయి



ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత మా గ్రూపులో నాలుగు విడతలుగా ఒక్క సభ్యురాలికి రూ.52,564 చొప్పున రుణమాఫీ జరిగింది. నాకు వైఎస్సార చేయూత పథకం కింద మూడు సార్లు రూ.18,500 చొప్పున వచ్చింది. సున్నా వడ్డీ కూడా జమ చేశారు.

– మిక్కిలి రాజేశ్వరి, ప్రగతి గ్రూపు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవలు



మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ప్రజలకు విస్తృతంగా సేవలు అందించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల కృత్రిమ చేతుల పంపిణీ చేసి ఎంతో మంది పేదలకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అండగా నిలిచింది. ఈ నేపథ్యంలో మంగళకరం పేరుతో ప్రోస్టటిక్ హ్యాండ్ నూతన ప్రాజెక్ట్ ప్రమోషన్ వాల్‌పోస్టర్లను ఆదివారం గవర్నర్ డాక్టర్ వడ్లమాని రవి ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టను దేశంలో తొలిసారిగా మంగళగిరిలో ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఇసునూరి చక్రవర్తి, గాజుల శ్రీనివాసరావు, అందే మురళీ మోహన్, పారేపల్లి నిరంజన్‌గుప్తా, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేడు తుళ్లూరులో ఆసరా చెక్కుల పంపిణీ

తాడికొండ: తుళ్లూరు మండలంలో సోమవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరగనుందని ఏపీఎం చిన వీరయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, సమన్వయకర్త మేకతోటి సుచరిత హాజరుకానున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రానున్న ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న షారూక్ షబ్లి

మంగళగిరి: ముస్లింలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్నాయని మైనార్టీ హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకూఖ్ షబ్లి విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జనాభా ప్రకారం ఎవరు అత్యధిక సీట్లు కేటాయిస్తారో వారికే ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. పట్టణంలోని ఈద్గా షాదీఖానాలలో ఆదివారం ఇస్లామిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ హక్కుల్ని సాధించుకునేందుకు మైనార్టీలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అత్యధికంగా రాజ్యాంగ పదవులు కేటాయించిన పార్టీలకే ముస్లింలంతా ఏకమై మద్దతు తెలియజేయాలని తెలిపారు. ముస్లింలను విమర్శించిన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ మౌలానా హుస్సేన్ మజహరి, ఎండీ. సలీం బాషా, మౌలానా మక్బూల్ అహ్మద్ నబి పాల్గొన్నారు.

యువ వ్యాపార వ్యవస్థాపక సదస్సుకు స్పందన



సదస్సుకు హాజరైన పూర్వ విద్యార్థులు, కేఎల్‌యూ ప్రతినిధులు

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సును ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు సొంతంగా వ్యాపారాలను స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో వ్యాపారాలు స్థాపించిన వారు పెద్దసంఖ్యలో రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అమరావతి బోటింగ్ క్లబ్ వ్యవస్థాపకులు, కేఎల్‌యూ పూర్వ విద్యార్థి తరుణ్ మాట్లాడుతూ ఎన్నో కొత్త ఆలోచనలకు, కొత్త సౌకర్యాలకు నాంది కేఎల్‌యూ అని తెలిపారు. నూతన వ్యాపారాలను స్థాపించాలనుకునే వారికి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. శ్రీకావ్య, అసిస్టెంట్ డైరెక్టర్ సోని, సీనియర్ మేనేజర్ కృష్ణారావు, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి నగరోత్సవం



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: లక్ష్మీపురం త్యాగరాజస్వామి కళా వేదికగా గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో ఆదివారం సంగీత గురువు త్యాగబ్రహ్మ 177వ ఆరాధన సంగీత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ బి. జయామూర్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ హరి కథకులు శంభయాచారి త్యాగరాజస్వామి వేషధారణలో ఆయన కీర్తనల ఆలాపనతో నగరోత్సవం నిర్వహించారు.అనంతరం పంచరత్న కీర్తనల గానం జరిగింది. శాస్త్రీయ సంగీత కచేరిలో చెన్నైకు చెందిన సాయి విఘ్నేష్ పలు త్యాగరాజ స్వామి కృతుల్ని శ్రావ్యంగా గానంచేసి సంగీతాభిమానుల్ని అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎం.డి.వి. రమణారావు మాట్లాడుతూ అయోధ్యలో రాముడి ప్రతిష్ట జరిగిన ఈ సంవత్సరం త్యాగరాజ ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని తెలిపారు. డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలతో నగరోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాకారుల్ని అభినందించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, కోశాధికారి ఎం.విజయలక్ష్మి పర్యవేక్షించారు. ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి నిర్వహించారు.

వైద్య వృత్తి మహోన్నతం



భాష్యం రామకృష్ణను సత్కరిస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య వృత్తి మహోన్నతమైనదని, ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా వైద్యులు భావిస్తారని జీజీహెచ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఆదివారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉత్తమమైన వైద్యులకు ఉండాల్సిన ముఖ్య లక్షణాలుగా లోకజ్ఞానం, భావవ్యక్తీకరణ నైపుణ్యంతో పాటు, రోగులపై కరుణ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. జీజీహెచ్ న్యూరాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని గుర్తించాలని విద్యార్థులకు సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉత్తమమైన వైద్యులుగా రాణించడానికి భాష్యం మెడెక్స్ ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత పూర్వ విద్యార్థులు భాష్యం మెడెక్స్‌తో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాల్ని జూనియర్లతో పంచుకున్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

మంగళగిరి: పట్టణంలోని మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ తీసుకున్న 60 మంది విద్యార్థులకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు.

క్రీడాకారులకు అభినందనలు



తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి జిల్లాస్థాయికి ఎంపికై, వివిధ కేటగిరీల్లో గెలుపొందిన క్రీడాకారులను వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. క్రీడాకారులంతా రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు రమేష్, సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని రాజ్‌కమల్ రోడ్డులో పేకాడాడుతున్న ఆరుగురిని ఆదివారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 5120 స్వాధీనం చేసుకున్నారు.

నిరుద్యోగ యువతకు కీట్స్ ట్రస్ట్ ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: నందిగామలోని కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు హెల్త్‌కేర్ కౌన్సిలర్, కో–ఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్‌కేర్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై డిగ్రీ, పీజీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో శిక్షణ కల్పించి, ఉద్యోగావకాశాలు చూపిస్తామని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శిక్షణకు సంబంధించిన వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ప్రభు బల్లారాధన ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న సమన్వయకర్త మేకతోటి సుచరిత

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల విజ్ఞాపన మినిస్ట్రీస్ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రభు బల్లారాధన ప్రత్యేక ప్రార్థనల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మినిస్ట్రీస్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న దైవసేవపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రార్థనలకు హాజరైన దైవజనులతో పాటు దేవునికి హృదయపూర్వక వందనాలు తెలిపారు. దేవుడు తన ప్రణాళికలు ఉన్న వారిని పిలుస్తాడని, ఆ రీతిగా తాను ఆయన ప్రణాళికలో ఉన్నానని తెలిపారు. అందుకే తనను దేవుడు ఈ ఆరాధనకు పిలిపించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ ఏసురత్నం, షేక్ మస్తాన్, గడ్డం రాంబాబు, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆ నాటి స్నేహం మధురాతి మధురం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 1974–1975లో పదో తరగతి చదివిన వారంతా పెదవడ్లపూడిలోని మామిడి తోటలో కలుసుకున్నారు. చిరునవ్వులు, ఆలింగనాలు, ఆప్యాయత పలకరింపులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ప్రస్తుత హోదాలను మరచి చిన్నపిల్లలుగా మారి స్కూలు రోజులను గుర్తు చేసుకున్నారు. చిన్నతనంలో చేసిన చిలిపి జ్ఞాపకాలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం చక్కటి విందును ఆరగించారు.

బంద్, సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో ప్రసంగిస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరావు

తాడేపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని నిరీర్వ్యం చేస్తోందని విమర్శించారు. సీ టు ప్లస్ 50 శాతం మద్దతు ధరలను పార్లమెంటులో ఆమోదించేందుకు చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, నాలుగుగా మార్చడం దుర్మార్గమని ఖండించారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సీఐటీయూ నాయకులు వడ్డేశ్వరం పున్నయ్య, మహిళా సంఘం తాడేపల్లి మండల అధ్యక్షురాలు కారసాల స్వాతి పాల్గొన్నారు.

11న గాయకులకు స్వరరత్న పురస్కారాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రంగారావు, గాయకులు

పాత గుంటూరు: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11న ఇన్నర్ రింగు రోడ్డులోని శిల్పారామం వేదికగా విశిష్ట గాయకులకు స్వరరత్న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ వ్యవస్థాపకులు పాత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఘంటసాల గానామృతం పేరుతో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.అనంతరం జరిగే సభలో అతిథులుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఘంటసాల కృష్ణకుమారి పాల్గొని 14 మంది గాయకులకు పురస్కారాలు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు నాజ్‌సెంటర్‌లోని ఘంటలసాల విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కళా సంస్థల ప్రతినిధులు మిరియాల ప్రసాదరావు, మేకల పురుషోత్తమ ప్రసాద్, గాయకులు జరీనా, బాబూరావు, సుధీర్ బాబు, రజని, సభ్యులు రాజశేఖర్ పాల్గొన్నారు.